తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
28-06-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 140
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## 'ట్రీ ప్రూనర్ల' కొనుగోలుపై ఆరోపణలు నిరాధారం

- పూర్తి పారదర్శకంగానే బ్యాటరీ యంత్రాల సేకరణ
- నేరుగా తయారీ సంస్థ నుంచే కొనుగోలు
- కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలు
- వాస్తవాలకు పూర్తి విరుద్ధం
- స్పష్టం చేసిన టీజీఎస్పీడీసీఎల్




**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** వర్షాకాలంలో ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగి పడటం వల్ల కలిగే అంతరాయాలను త్వరితగతిన సరిచేసేందుకు టీజీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేసిన అత్యాధునిక బ్యాటరీ ఆధారిత ట్రీ ప్రూనర్లు, పోల్ ప్రూనర్లు, చైన్ సా యంత్రాల కొనుగోలుపై వచ్చిన ఆరోపణలను సంస్థ తీవ్రంగా ఖండించింది. కొన్ని పత్రికలలో ప్రచురితమైన కథనాలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ కొనుగోలు ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా, అన్ని నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని స్పష్టం చేస్తూ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. పత్రికల్లో వచ్చిన కథనాల్లో

మిగతా 2వ పేజీలో..

## రవాణా శాఖలో పైరవీలకు బ్రేక్..!

- పారదర్శక, అవినీతి రహిత సేవలకు సరికొత్త ప్రణాళిక
- డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షలు ఇక మరింత కఠినం
- ఆర్టీవో ఆఫీసుల్లో మధ్యవర్తులపై ఉక్కుపాదం
- బ్రోకర్లకు కొమ్ముకాసే సిబ్బందిపైనా చర్యలు
- విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్
- ఇబ్రహీంపట్నంలో జేటీసీ మెరుపు తనిఖీ

2



# రైతు డిస్కమ్
# ఇక రూరల్ డిస్కమ్..!



- ప్రజాభిప్రాయంతో ప్రతిపాదనల్లో భారీ సవరణలు..
- గ్రామీణ ప్రాంతాలన్నీ కొత్త సంస్థ పరిధిలోకి..
- రేపో మాపో లైసెన్స్ జారీ
- కేవలం ఉచిత, వ్యవసాయ కనెక్షన్లతో డిస్కమ్ ఏర్పాటు సాధ్యం కాదన్న మేధావులు
- అభ్యంతరాలతో మారిన ప్రభుత్వ పంథా
- వ్యవసాయంతో పాటు గ్రామీణ విద్యుత్ సర్వీసులు పూర్తిగా కొత్త డిస్కమ్ పరిధిలోకి..
- 11 కేవీ, 33 కేవీ లైన్ల నిర్వహణ అంతా ఒకే గొడుగు కిందకు
- సాంకేతిక చిక్కులకు బ్రేక్..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** తెలంగాణలో సరికొత్త విద్యుత్ విప్లవానికి నాంది పలుకుతూ ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న 'రైతు డిస్కమ్' రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయి. కేవలం రైతులకు సంబంధించిన సర్వీసులు, ఉచిత కనెక్షన్లతో మాత్రమే కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయాలనుకున్న ప్రభుత్వ నిర్ణయంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజే ప్రారంభం కావాల్సిన ఈ సంస్థ.. మేధావులు, ప్రజా సంఘాల నుండి వ్యక్తమైన తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో వాయిదా పడి, ఇప్పుడు సరికొత్త సవరణలతో 'గ్రామీణ (రూరల్) డిస్కమ్'గా రూపాంతరం చెందుతోందని విద్యుత్ శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఆది నుంచి అడ్డంకులే..**

**ఈఆర్సీ నిలదీత**

రైతు డిస్కమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన నాటి నుండి ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ సంస్థల నుండి, కేవలం పైసా ఆదాయం రాని ఉచిత, వ్యవసాయ సర్వీసులతో కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయడం ఎలా సాధ్యమని ఉద్యోగ సంఘాలు, విద్యుత్ నిపుణులు

మిగతా 3వ పేజీలో..






## నాడు ప్రైవేటు..
## నేడు ప్రభుత్వ భూమి !

- సర్వే నం.1 భూ మోసం బట్టబయలు.. నోటరీ ప్లాట్ల పేరిట కోట్ల కుంభకోణం..
- హస్మత్‌పేట్‌లో హైడ్రా హల్‌చల్.. అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- అధికారులు, నాయకుల పాత్రపై అనుమానాలు ?
- హైడ్రా కూల్చివేతల తర్వాత అసలు దోషులను వెలుగులోకి తెస్తారా ?

2

## మీ శైలికి అనుగుణంగా, పత్రికలో
## ప్రచురించేందుకు సిద్ధంగా రీ రైట్ చేసిన కథనం

- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- మహేశ్వరంలో బీఆర్ఎస్ జోష్.. గెలుపు మాదేనన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో విధ్వంసమే.. కేసీఆర్ పాలనే బెటర్
- రేవంత్‌పై ఘాటు విమర్శలు.. 'రెన్యూవల్ సీఎం' అంటూ ఎద్దేవా

2



## మరో ఐదు రోజులు
# భారీ వర్షాలు

- తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక
- ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు
- ములుగు జిల్లాలో అత్యధికంగా 10 సెం.మీ వర్షపాతం

3



## ముగ్గురు సీఎంల భేటీలో చీకటి ఒప్పందాలేంటి?

- కర్ణాటక సమావేశంపై హరీష్‌రావు ఫైర్
- తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారంటూ ఆరోపణలు
- నీటి హక్కుల విషయంలో రాజీ పడేది లేదన్న బీఆర్ఎస్

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:** కర్ణాటకలో ఇటీవల జరిగిన మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఎలాంటి చీకటి ఒప్పందాలు జరిగాయో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ముగ్గురు ముఖ్యమంత్రులు, నీటి పారుదల

మిగతా 2వ పేజీలో..



## పరారీలో 'గోల్డ్ మ్యాన్' సూర్యా భాయ్

- ఇంటికి తాళం వేసి రాత్రికి రాత్రే పరార్
- రూ.30 లక్షల మోసం ఆరోపణలు.. గాలింపు ముమ్మరం
- కేసు నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ



**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:** మార్కెట్ ధర కంటే తక్కువకే బంగారం అందిస్తానని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'గోల్డ్ మ్యాన్' సూర్యా భాయ్ పరారయ్యాడు. అతడిపై నమోదైన కేసులో అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసులకు ఇంటికి తాళం వేసి ఉండటం కనిపించింది. దీంతో నిందితుడు పరారైనట్లు పోలీసులు నిర్ధారించారు.

**రూ.30 లక్షల మోసం ఆరోపణలు**

బాధితులకు తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని నమ్మబలికి సూర్యా

మిగతా 2వ పేజీలో..



## ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న 'తెలంగాణ రైజింగ్'

నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు

ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

2



## అజిత్ రెడ్డికి మెట్రో అదనపు ఎండీగా బాధ్యతలు

2

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసమే 'సర్'

ఎన్నికల సంఘం నిర్వహించే స్వతంత్ర ప్రక్రియ

ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

3



విపక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయి

బీఎల్ఓలను బెదిరించవద్దు, వేరే పనులు పురమాయించొద్దు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## నేడు పల్స్ పోలియో కార్యక్రమం

- చిన్నారులకు పోలియో చుక్కలకు ఏర్పాట్లు

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ ఆదివారం పల్స్ పోలియో నిర్వహించనున్నారు. అయిదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని

మిగతా 3వ పేజీలో..






## 'ట్రీ ప్రూనర్ల' కొనుగోలుపై
# ఆరోపణలు నిరాధారం

**మొదటిపేజీ తరువాయి**

సాంకేతిక అవగాహన లోపించిందని సంస్థ పేర్కొంది. కొనుగోలు చేసిన పరికరాలు సాధారణ ఇళ్లలో తోటల పెంపకానికి వాడేవి కావని.. నిరంతరాయంగా, కఠినమైన వాతావరణంలో పనిచేసే విద్యుత్ పంపిణీ సంస్థల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన అత్యుత్తమ ఇండస్ట్రియల్ గ్రేడ్ పరికరాలని తెలిపింది. ఈ ఆధునిక బ్యాటరీ ఆధారిత యంత్రాల పనితీరుపై క్షేత్రస్థాయిలో వినియోగదారుల నుండి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందని పేర్కొంది. పాత కాలపు పెట్రోల్ ఆధారిత యంత్రాలతో పోలిస్తే ఇవి ఎలాంటి శబ్ద కాలుష్యం గానీ, వాయు కాలుష్యం గానీ కలిగించకుండా పర్యావరణ హితంగా, అత్యంత వేగంగా చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాయని వెల్లడించింది.

**మధ్యవర్తులు లేరు.. నేరుగా కంపెనీ నుంచే కొనుగోలు..**

ఈ పరికరాల ధరలకు సంబంధించి వచ్చిన సందేహాలను కూడా టీజీఎస్పీడీసీఎల్ కొట్టిపారేసింది. సంబంధిత అంతర్జాతీయ తయారీ సంస్థ వెబ్‌సైట్ ద్వారా మార్కెట్ ధరలను ఎవరైనా నేరుగా ధృవీకరించుకోవచ్చని తెలిపింది. ఈ కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి బ్రోకర్లు లేదా మధ్యవర్తులు లేరని.. నేరుగా తయారీ సంస్థ/అధీకృత డీలర్ల నుంచే విద్యుత్ సంస్థ వీటిని సేకరించిందని స్పష్టం చేసింది. కొనుగోలు ధరల్లో జీఎస్టీతో సహా మొత్తం వ్యయం పొందుపరచబడిందని.. ఈ కొనుగోలుపై చెల్లించిన జీఎస్టీ మొత్తాన్ని సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో తిరిగి క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండటంతో, సంస్థపై పడే వాస్తవ ఆర్థిక భారం మార్కెట్ ధర కంటే మరింత తగ్గుతుందని వివరించింది.

**వర్షా న్ని తట్టుకునే ప్రత్యేక ప్రమాణాలు!**

పాత పెట్రోల్ యంత్రాల్లో వర్షానికి తడిస్తే కార్బ్యురేటర్ ప్రాబ్లమ్స్ రావడం, స్టార్టింగ్ ఇబ్బందులు తలెత్తడం సహజమని.. కానీ ఈ నూతన బ్యాటరీ యంత్రాలు వర్షాకాల పరిస్థితులను, తీవ్రమైన తేమను, ఈదురుగాలులను సైతం తట్టుకునేలా ప్రత్యేక అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించబడ్డాయని సంస్థ తెలిపింది. గత వారం కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ఈ యంత్రాల వినూత్న సాంకేతికత వల్లే సిబ్బంది ప్రాణాలకు ముప్పు లేకుండా, అత్యంత వేగంగా లైన్ క్లియరెన్స్ పనులు పూర్తి చేశామని.. తద్వారా వినియోగదారులకు అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరాను అందించగలిగామని పేర్కొంది.

**వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలి..**

సరైన సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా, అంతర్జాతీయ ప్రమాణాలు గల అత్యుత్తమ పరికరాల కొనుగోలును తప్పుగా చిత్రీకరించడం విచారకరమని టీజీఎస్పీడీసీఎల్ పేర్కొంది. ఏదైనా అంశంపై కథనాలు ప్రచురించే ముందు డిపార్ట్‌మెంట్ నుండి పూర్తి వివరాలు, వాస్తవాలు సేకరించాలని మీడియా సంస్థలకు సూచించింది. ప్రజలను అయోమయానికి గురిచేసేలా మరియు ప్రభుత్వ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేలా చేసే ఇలాంటి తప్పుడు ప్రయత్నాలను తాము పూర్తిగా ఖండిస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

## ముగ్గురు సీఎంల భేటీలో
# చీకటి ఒప్పందాలేంటి?

**మొదటిపేజీ తరువాయి**

శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులు కూడా లేకుండా సమావేశమై ఏ నిర్ణయాలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు.

**తెలంగాణకు నష్టం జరిగేలా ఒప్పందాలా?**

కర్ణాటకలో నవెలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణంపై చర్చలు జరుగుతుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందమంటూ సంబరాలు చేసుకోవడం బాధాకరమని హరీష్‌రావు విమర్శించారు. గతంలో గుండ్రేవుల ప్రాజెక్టుకు నీరు వెళ్లకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ దాన్ని ముందుకు తీసుకొస్తోందని ఆరోపించారు.

**ఆర్డీఎస్‌పై స్పష్టత ఇవ్వాలి**

ఆర్డీఎస్‌కు శాశ్వత నీటి కేటాయింపులపై ఏమైనా హామీ లభించిందా అని హరీష్‌రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడినా, తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ అనుమతులు**

గత 60 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సగటున ఏడాదికి నాలుగు టీఎంసీల చొప్పున మాత్రమే అనుమతులు సాధించాయని, బీఆర్ఎస్ పాలనలో మాత్రం ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని హరీష్‌రావు తెలిపారు. తెలంగాణకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు లభించాయని, మిగిలిన 138 టీఎంసీల అనుమతులు ఇంకా రావాల్సి ఉందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు.

**తెలంగాణ ప్రయోజనాలను కాపాడతాం**

పాలమూరు ప్రాంతానికి నీటి సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీష్‌రావు విమర్శించారు. మేడిగడ్డ గేట్ల మరమ్మతులను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాల పనులపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలోనైనా అన్యాయం జరిగితే కేసీఆర్, బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు.

## అజిత్ రెడ్డికి మెట్రో అదనపు ఎండీగా బాధ్యతలు

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్::**

సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా అజిత్ రెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. అజిత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ అనంతరం తాజాగా ఆయనకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో కీలక అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. ప్రస్తుతం హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాగుతున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్వహణ, విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు పరిపాలనా వ్యవహారాల్లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకం దోహదపడుతోందని ప్రభుత్వం భావిస్తోంది.



# రవాణా శాఖలో 'పైరవీ'లకు బ్రేక్..!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రవాణా శాఖలో పైరవీ లేని పారదర్శక సేవలు ప్రజలకు అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయన్నీ అయన ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహణ తీరు, ప్రజలకు అందుతున్న సేవలు, వాహన్ పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిస్థిని అడిగి తెలుసుకున్నారు.

**డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహణ సమీక్ష**

జేటీసీ స్వయంగా డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రస్తుత ప్రమాణాలు రహదారి భద్రతకు తగినంతగా ఉన్నాయా అని అంచనా వేసి, డ్రైవింగ్ పరీక్ష మరింత కఠినంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని గట్టిగా సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అనేది కేవలం ఒక పత్రం మాత్రమే కాదు అది రహదారిపై వాహనం నడపడానికి ఇచ్చే అనుమతి. నిర్లక్ష్యంగా నిర్వహించే పరీక్షలు నేరుగా రోడ్డు ప్రమాదాలకు దారితీస్తాయి. నిజంగా నైపుణ్యం కలిగిన వాహన దారులకు మాత్రమే లైసెన్స్ జారీ చేయాలి. అని అధికారులను ఆదేశించారు.

**సిటిజెన్ సర్వీసులపై పై ప్రజలతో నేరుగా సంభాషణ**

జేటీసీ దరఖాస్తుదారులతో పాటు సాధారణ ప్రజలతో నేరుగా మాట్లాడారు. ప్రజలకు అందుతున్న సేవలు, వేచి ఉండే సమయం, సిబ్బంది వ్యవహారం మరియు ఆన్‌లైన్ పోర్టల్ వినియోగంపై అభిప్రాయాలు సేకరించారు. ప్రతి దరఖాస్తుదారుని మర్యాదగా చూడాలని, నిర్దేశిత గడువులోపు దరఖాస్తులు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. వాహన దారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

వాహన్ పోర్టల్.. పెండింగ్ దరఖాస్తుల సమీక్ష

వాహన్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిని వివరంగా సమీక్షించారు. వాహన రిజిస్ట్రేషన్ ఆమోదం లోని జాప్యాలు పరిశీలించారు. బ్యాక్‌లాగ్‌లను ప్రాధాన్యతగా క్లియర్ చేయాలని, వాహన్ దరఖాస్తుల పరిష్కారంలో అనవసర జాప్యం తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

**అనధికార వ్యక్తులపై కఠిన నిషేధం**

ఆర్టీవో కార్యాలయ ప్రాంగణంలో ఏజెంట్లు, మధ్యవర్తులు, అనధికార వ్యక్తులనూ అనుమతించరాదని అయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఏజెంట్లకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అయన తెలిపారు.సిబ్బంది వ్యక్తిగతంగా జవాబుదారీగా ఉండాలని లేకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన ద్వారం వద్ద అన్ని కౌంటర్ల వద్ద నిషేధ నోటీసులు ప్రదర్శించాలని ఆదేశించారు. పౌరులు నేరుగా కౌంటర్ల వద్దకు వచ్చి లేదా వాహన్ సారథి ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా సేవలు పొందవచ్చని తెలిపారు. తెలంగాణ అంతటా పారదర్శకమైన, సమర్థవంతమైన, ప్రజలకు మెరుగైన సేవలందించాలనే రవాణా శాఖ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఆర్.టి.వో. కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.తనిఖీల సందర్భంగా రవాణా శాఖల లోటు పాట్లపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నామని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఆయా ఈ సందర్భంగా అన్నారు.

# ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న తెలంగాణ రైజింగ్

**హైదరాబాద్,జూన్ 27 సిరి న్యూస్::**

తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడెర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# నాడు ప్రైవేటు.. నేడు ప్రభుత్వ భూమి !

**బోయిన్‌పల్లి, జూన్ 27 ( సిరి న్యూస్):**

హస్మత్‌పేట్ డివిజన్ సర్వే నంబర్ 1లో చత్రిగడ్డలోని 10 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని కొంత మంది అక్రమార్కులు కొంత కాలంగా నవాబుల ప్రైవేటు భూమి అని నమ్మబలికి విక్రయించారు. నోటరీ పత్రాలు తయారుచేసి ప్లాట్లుగా విభజించి అమ్మేశారు. తహసీల్దారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు. అన్ని పార్టీల నాయకులు కమీషన్లు మూటగట్టారు. అమాయక ప్రజలు జీవితకాల పొదుపులు వెచ్చించారు. చివరికి హైడ్రా వచ్చి కూల్చేసింది...అమ్మినవారు కోట్లు మూటగట్టారు... అధికారులు జేబులు నింపుకున్నారు... నాయకులు కమీషన్లు లాగేశారు... మోసపోయింది మాత్రం అమాయక సామాన్యులు.. దొంగలంతా ఒకటై ఊరంతా పంచుకున్న తీరుగా తయారైంది హస్మత్ పేట్ ప్రాంతం.. హస్మత్ పెట్, సర్వే నంబర్ 1 లో ఉన్న భూమిని నాడు ప్రవేటు భూమిగా చిత్రీకరించి నేడు ప్రభుత్వ భూమిగా మార్చడంతో బాధిత కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ, అంటే హైడ్రా. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శక్తిమంతమైన యంత్రాంగం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, పురావస్తు శాఖ స్థలాలను రక్షించే లక్ష్యంతో పని చేస్తోంది. అక్రమ నిర్మాణాలపై నిర్దాక్షిణ్యంగా కూల్చివేతలు చేపడుతూ హైడ్రా ఇప్పటికే పలు ప్రాంతాల్లో సంచలనం సృష్టించింది. తాజాగా ఓల్డ్ బోయిన్‌పల్లి హస్మత్‌పేట్‌లో హైడ్రా చర్యలు మరోసారి సంచలనంగా మారాయి. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి సర్కిల్, హస్మత్‌పేట్ డివిజన్‌లో సర్వే నంబర్ 1. చత్రిగడ్డ వద్ద 10 ఎకరాలకుపైగా విస్తరించిన ప్రభుత్వ భూమిని కొంత మంది అక్రమార్కులు సంవత్సరాల తరబడి కబ్జా చేసి, నోటరీ ప్లాట్ల పేరుతో అమాయకులకు అమ్మేశారు. ఫిర్యాదుల వెల్లువతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. శనివారం తెల్లవారుజామున 7 గంటలకు భారీ పోలీసు బందోబస్తుతో జేసీబీలతో అక్రమ నిర్మాణాలన్నీ నేలమట్టం చేశారు..

**సంవత్సరాలుగా భూ మోసం ఎలా జరిగింది.?..**

ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. ఇది కేవలం భూకబ్జా కాదు. ఇది సంవత్సరాల పాటు జరిగిన సుసంఘటిత భూ మోసం. సర్వే నంబర్ 1లో 10 ఎకరాలు ఉన్న భూమిని కొంత మంది అక్రమార్కులు నవాబుల ప్రైవేటు భూమి అని చెప్పుకుంటూ సంవత్సరాల తరబడి విక్రయాలు చేశారు. నోటరీ పత్రాలు తయారుచేశారు. ప్లాట్లుగా విభజించి అమ్మారు. లక్షలు, కోట్లు మూటగట్టుకున్నారు. ఇందులో కేవలం అక్రమార్కులు మాత్రమే కాదు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు అందరూ కుమ్మక్కై వేల కోట్ల రూపాయలు కమీషన్ల రూపంలో జేబులు నింపుకున్నారు. అమాయక కొనుగోలుదారులు తమ జీవితకాల సంపాదనను ఈ ప్లాట్లలో పెట్టుబడి పెట్టారు. ఇప్పుడు అది ప్రభుత్వ భూమిగా తేలింది. అమ్మినవాళ్ళు మాయమయ్యారు. కమీషన్లు తీసుకున్నవాళ్ళు తలుపులు వేసుకున్నారు. నష్టపోయింది మాత్రం సామాన్యుడు.

**నాయకుల నోళ్ళు ఎందుకు మూతబడ్డాయి.?**

ఇది అత్యంత ఆగ్రహకరమైన అంశం. అమ్మినప్పుడు కమీషన్లు తీసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, అన్ని పార్టీల నాయకులకు ఇప్పుడు గొంతు పెగలడం లేదు. హైడ్రా కూల్చివేతలు జరుగుతున్నాయి. అమాయకులు రోధిస్తున్నారు. కానీ ఒక్క నాయకుడూ సంఘటన స్థలానికి రాలేదు. ఒక్క మాట మాట్లాడలేదు. ఒక్క ప్రశ్న అడగలేదు. ఎందుకంటే వాళ్ళు మాట్లాడితే తమ పాత్ర బయటపడుతుంది. కమీషన్లు తీసుకున్న నిజం వెలుగులోకి వస్తుంది. అందుకే అందరూ మౌనంగా తలుపులు వేసుకుని కూర్చున్నారు. తహసీల్దార్ అధికారులు సంవత్సరాల పాటు ఈ అక్రమ విక్రయాలు జరుగుతున్నా కళ్ళు మూసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు వారూ గుప్‌చుప్‌గా ఉన్నారు.

**అమాయకుల గోస..లక్షల్లో నష్టం..**

హస్మత్‌పేట్ ప్రాంత స్థానికులు ఇప్పుడు పెద్ద సంక్షోభంలో పడ్డారు. జీవితకాల సంపాదన పెట్టి ఈ ప్లాట్లు కొన్న సామాన్యులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. వాళ్ళు చేసిన తప్పేముంది.? నవాబుల భూమి, ప్రైవేటు భూమి అని నమ్మబలికిన మోసగాళ్ళను నమ్మారు. నోటరీ పత్రాలు చూసి కొన్నారు. అధికారులు అనుమతులు ఇచ్చారు. నాయకులు సాక్షిగా ఉన్నారు. మరి తప్పు చేసింది అమాయకుడా.? మోసగాళ్ళకు శిక్ష పడుతోందా.? లేదు. జేసీబీ దెబ్బ పడేది మాత్రం అమాయకుడి కలలపై. ఇది న్యాయమా అని ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు..

**ఆక్రమణలకు కఠిన శిక్ష తప్పదు..:**

**హైడ్రా హెచ్చరిక**

హైడ్రా అధికారులు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, పురావస్తు భూములు ఆక్రమిస్తే ఇకపై ఎలాంటి సానుభూతి ఉండదని, కూల్చివేతలు ఆగవని, చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. హస్మత్‌పేట్ తర్వాత మరెన్ని ప్రాంతాల్లో హైడ్రా జేసీబీలు దిగుతాయో లేదో వేచి చూడాలి.

**న్యాయం జరగాలని బాధితుల డిమాండ్..**

ప్రభుత్వ భూమి అమ్మిన అక్రమార్కులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కేవలం అక్రమ నిర్మాణాలు కూల్చడంతో సరిపోదు. ఈ భూమి అమ్మకాల వెనక ఉన్న మోసగాళ్ళపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. వారిని అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలి. కమీషన్లు తీసుకున్న అధికారులు, నాయకుల పై విచారణ జరపాలి. తహసీల్దారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ అక్రమ విక్రయాలకు సహకరించారని స్పష్టంగా కనిపిస్తోంది. వారిపై విభాగీయ విచారణ చేపట్టి నిజాలు బయటకు తీయాలి. రాజకీయ నాయకుల పాత్ర కూడా విచారణకు వెళ్ళాలి. అమాయకంగా కొన్న సామాన్యులకు న్యాయం చేయాలి. లక్షలు పెట్టి ప్లాట్లు కొన్న అమాయక కొనుగోలుదారులు ఇప్పుడు రోడ్డున పడ్డారని, తమకు పరిహారం అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కూల్చివేతలతో సరిపోదు, బాధితులకు న్యాయం అందించాలి. తహసీల్దారులు, టౌన్ ప్లానింగ్ అధికారులపై జవాబుదారీతనం నిలబెట్టాలి. సంవత్సరాల పాటు ఈ అక్రమాలు జరుగుతుంటే వాళ్ళు ఏం చేస్తున్నారు.? అనుమతులు ఇచ్చింది ఎవరు.? కళ్ళు మూసుకున్నది ఎందుకు.? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పవలసిన బాధ్యత అధికారయంత్రాంగానిది.. హస్మత్‌పేట్ ప్రజల గుండె మండుతోంది. న్యాయం కోసం వేచి చూస్తోంది. హైడ్రా నిర్మాణాలు కూల్చింది,



## పరారీలో 'గోల్డ్ మ్యాన్' సూర్యా భాయ్

**మొదటిపేజీ తరువాయి**

భాయ్ సుమారు రూ.30 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు తీసుకున్న తర్వాత బంగారం ఇవ్వకపోవడంతో పాటు, డబ్బులు తిరిగి కోరిన వారిని వేధించినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. కొందరు బాధితులపైనే ఎదురు కేసులు నమోదు చేయించే ప్రయత్నం చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

**అరెస్టు భయంతో పరార్**

ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో మోసం వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వెళ్లేలోపే అతడు ఇంటికి తాళం వేసి పరారైనట్లు తెలిసింది.

**గాలింపు ముమ్మరం**

ఘటన తీవ్రత దృష్ట్యా కేసును తదుపరి విచారణ కోసం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడు షాద్‌నగర్ వైపు వెళ్లి ఉండొచ్చనే అనుమానంతో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. త్వరలోనే సూర్యా భాయ్‌ను అరెస్ట్ చేస్తామని పోలీసులు వెల్లడించారు.

# మీ శైలికి అనుగుణంగా, పత్రికలో ప్రచురించేందుకు సిద్ధంగా రీ రైట్ చేసిన కథనం

**రంగారెడ్డి, జూన్ 27 సిరి న్యూస్::**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, తెలంగాణలో మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో శనివారం పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులకు ఎస్ఐఆర్ కార్యక్రమంతో పాటు సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు.

మహేశ్వరంలో కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీఆర్ఎస్ విజయంపై ఎలాంటి సందేహం లేదని కేటీఆర్ అన్నారు. ఇక్కడ మరోసారి సబితా ఇంద్రారెడ్డి విజయం ఖాయమని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పరాజయం పాలవడం, బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలె" అనే నినాదమే వినిపిస్తోందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పాలనలో విధ్వంసం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయి విధ్వంసం మాత్రమే కనిపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ కిట్, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని కేసీఆర్ పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించారని, ప్రస్తుతం ప్రజలు మళ్లీ ఆ పాలననే కోరుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తూ ఆయన పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందన్నారు.

**హామీలు గాలికొదిలారు**

ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు పెంపు, యూరియా సరఫరా వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులతోనే గురుకుల పాఠశాలలు, విద్యుత్ రంగం, కల్యాణలక్ష్మి, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు, కొత్త కలెక్టరేట్లు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**'రెన్యూవల్ సీఎం' అంటూ ఎద్దేవా**

రెండున్నరేళ్లలో భారీ అప్పులు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తరచూ ఢిల్లీకి వెళ్తున్నారని, అందుకే ఆయనను 'రెన్యూవల్ సీఎం' అని ప్రజలు అంటున్నారని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు.

**కార్యకర్తలకు పిలుపు**

ఫార్మా సిటీ విషయంలో కాంగ్రెస్ మాట మార్చిందని, రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదును డిజిటల్ విధానంలో పెద్దఎత్తున విజయవంతం చేయాలని, ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందజేస్తామని తెలిపారు.

# ఓటర్ల జాబితా ఖచ్చితత్వం కోసమే 'సర్'

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రక్రియ ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా, విశ్వసనీయంగా మార్చే అత్యంత కీలకమైన కార్యక్రమమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో శనివారం మాట్లాతూ ఇది కొత్తగా మొదలైన ప్రక్రియ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా అనేకసార్లు ఈ ప్రక్రియ నిర్వహించారని గుర్తుచేశారు. అర్హత ఉన్న ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించాలన్నదే ఈ ప్రక్రియ ఉద్దేశమన్నారు. దురదృష్టవశాత్తు కొన్ని పార్టీలు ఈ ప్రక్రియను కూడా రాజకీయ కోణంలో చూస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. 'సర్ 'ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో పోలింగ్ శాతం కూడా పెరిగిందన్నారు. ఎందుకంటే ఈ ప్రక్రియ ద్వారా ప్రతి ఓటరు చైతన్యవంతమవుతున్నారన్నారు. దీనివల్ల పోలింగ్ రోజు ఓటు వేయాలనే బాధ్యత, అవగాహన మరింత పెరుగుతోందన్నారు. ఎన్నికల సంఘం రాజకీయాలకు, ప్రభుత్వాలకు అతీతంగా పనిచేసే రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ.. అది ఏ పార్టీకి, ఏ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసే సంస్థ కాదు. కాబట్టి ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేయడం, ప్రజల్లో అనుమానాలు కలిగించడం, ఆందోళన సృష్టించడం సరైనది కాదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. బీఎల్ ఓలు ఇంటికే వచ్చి వివరాలు సేకరిస్తున్నారు కాబట్టి ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటర్ల జాబితా సవరణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో రోహింగ్యాలు, బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారు, పాకిస్తాన్ నుంచి అక్రమంగా వచ్చినవారు ఉన్నారనే విషయాలు గతంలో అనేక కేసుల ద్వారా బయటపడ్డాయని, కొంతమంది జైళ్లలో కూడా ఉన్నారని గుర్తు చేశారు. వారిలో చాలామందికి ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు కూడా ఉన్నాయనే విషయాలు వెలుగులోకి వచ్చాన్నారు. ఈ వాస్తవాలను పక్కనబెట్టి ఓటర్ జాబితా శుద్ధి ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేయడం విపక్షాల బాధ్యతారాహిత్యమన్నారు.ముఖ్యమంత్రి స్వయంగా కొన్ని వర్గాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎన్నికల సంఘంపై ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా ఈ ప్రక్రియ ఆగదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం, బీఎల్‌ఓలపై ఒత్తిడి తేవడం, ఇంటింటికీ వెళ్లొద్దని చెప్పడం వంటి చర్యలు అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రత్యేకంగా ఓల్డ్ సిటీలో ఎంఐఎం నాయకులు బీఎల్‌ఓలను బెదిరిస్తూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయవద్దని, తమ ద్వారా మాత్రమే ఫారాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం వస్తోందని. ఇది అత్యంత ప్రమాదకర ధోరణి అని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం ప్రక్రియపై రాజకీయ ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.మజ్లిస్ పార్టీ కనుసైగల్లో సర్ ప్రక్రియ నడవాలని ఎవరైనా అనుకుంటే అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను ఎవరైనా బెదిరిస్తే బీజేపీ వారికీ అండగా నిలుస్తుందన్నారు. కొన్నచోట్ల బీఎల్‌ఓలతో ఎన్నికల ప్రక్రియకు సంబంధం లేని కార్యక్రమాలు కూడా చేయిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని, ఇందిరమ్మ చీరల పంపిణీ వంటి కార్యక్రమాల్లో వారిని నియోగించడం తగదన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై కూడా ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. 'మీ ఓటు గ్రామంలో లేకపోతే మీ సంక్షేమ పథకాలు పోతాయి..మీ భూమి పోతుంది.. మీ పెన్షన్ పోతుంది అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంబెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ బెదిరింపులకు ఎవరూ లొంగాల్సిన అవసరం లేదు.హైదరాబాద్‌లో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ తమ ప్రస్తుత నివాసాన్ని ఆధారంగా చేసుకుని ఇక్కడే ఓటు నమోదు చేసుకోవచ్చు. భవిష్యత్తులో అవసరమైతే తిరిగి మీ గ్రామానికి, జిల్లాకు లేదా రాష్ట్రానికి మార్చుకునే అవకాశం ఎప్పుడైనా ఉంటుంది. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సర్ ప్రక్రియలో పాల్గొని ఎన్నికల సంఘానికి సహకరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నేడు పల్స్ పోలియో కార్యక్రమం

**మొదటిపేజీ తరువాయి**

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని నవజాత శిశువులు మొదలుకుని 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం బూత్ లలో పోలియో డ్రాప్స్ వేస్తారు. 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా చిన్నారులకూ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు అధికంగా ఉండటంతో జులై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగుతుంది.

కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి దామోదర్ ఇప్పటికే ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఒక్కరు కూడా మిగలకుండా బూత్ లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు,, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

# జులై 15 నుంచి ఉద్యోగుల ఆరోగ్య పథకం

- **ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ తొలి సమావేశంలో నిర్ణయం**
- **భార్యాభర్తల్లో ఒకరి నుంచే చందా మినహాయింపు**
- **వారం రోజుల్లో పూర్తి మార్గదర్శకాలు విడుదల**

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్::**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించిన కొత్త ఆరోగ్య పథకాన్ని జులై 15 నుంచి అమల్లోకి తీసుకురావాలని ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు నిర్ణయించింది. ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన శనివారం జరిగిన ట్రస్ట్ తొలి సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

పథకానికి సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను వారం రోజుల్లో విడుదల చేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే, వారిలో ఒకరి నుంచే చందా మినహాయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే అదనంగా మినహాయించిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతానికి ఈహెచ్‌ఎస్ నిబంధనలనే కొనసాగిస్తూ, అవసరమైన మార్పుల కోసం ప్రత్యేక ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే వారం రోజుల్లో ఆస్పత్రుల యాజమాన్య ప్రతినిధులు, ఆరోగ్య శాఖ అధికారులు, ట్రస్ట్ సభ్యులతో సమావేశం నిర్వహించి ప్యాకేజీ రేట్లు, ఎంపిక చేసే ఆస్పత్రుల జాబితాను ఖరారు చేయనున్నారు.

## హైదరాబాద్ శివార్లలో 110 కిలోల

# గంజాయి పట్టివేత

- **అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠా అరెస్ట్**
- **రూ.56 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**
- **నకిలీ నంబర్ ప్లేట్లు, ఇంటర్నెట్ కాలింగ్‌తో పోలీసులను మోసం చేసే ప్రయత్నం**

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:**

హైదరాబాద్ శివార్లలో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను శంషాబాద్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్, ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ డీసీపీ రాజేష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.56 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ కేసులో నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**ఒడిశా నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా**

పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముఠా ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తోంది. ఇందుకోసం టాటా హారియర్, మారుతి ఎర్టిగా కార్లను వినియోగించారు. ఒక వాహనాన్ని పైలట్ వాహనంగా ముందుకు పంపించి, మార్గమధ్యంలో పోలీసుల తనిఖీలపై సమాచారం అందిస్తూ మరో వాహనానికి ఎస్కార్ట్‌గా ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది.

**నకిలీ నంబర్ ప్లేట్లు..**

**యాప్‌ల ద్వారా సంప్రదింపులు**

పోలీసుల నిఘా నుంచి తప్పించుకోవడానికి వాహనాలకు నకిలీ మహారాష్ట్ర నంబర్ ప్లేట్లు అమర్చినట్లు గుర్తించారు. ఫోన్ కాల్స్‌కు బదులుగా ఇంటర్నెట్ ఆధారిత కాలింగ్ యాప్‌ల ద్వారానే పరస్పరం సమాచారాన్ని చేరవేసుకుంటూ అక్రమ రవాణా కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ గేట్ సమీపంలో రెండు వాహనాలను అడ్డుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**ప్రధాన సూత్రధారి కోసం గాలింపు**

ఒడిశాలోని బెర్హాంపూర్‌కు చెందిన ప్రభిత్ర ప్రధాన్ నుంచి కిలో గంజాయిని రూ.4 వేలకు కొనుగోలు చేసి, మహారాష్ట్రలో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠా ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని డీసీపీ తెలిపారు. కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసులు ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు చేపట్టారు.



# మరో ఐదు రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:**

తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండగా, పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి.

ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**పలుచోట్ల భారీ వర్షపాతం**

గత 24 గంటల్లో ములుగు జిల్లా వెంకటాపురంలో అత్యధికంగా 10 సెం.మీ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8 సెం.మీ, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 6.6 సెం.మీ, కరీంనగర్ జిల్లా దుర్శేడులో 5.8 సెం.మీ నమోదైంది. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్, సూర్యాపేట జిల్లా ముకుందపురంలో 5.6 సెం.మీ, మెదక్ జిల్లా రామాయంపేటలో 5.3 సెం.మీ, ఖమ్మం జిల్లా తల్లాడ, మహబూబాబాద్ జిల్లా భయ్యారంలో ఐదు సెం.మీ చొప్పున వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, చంద్రుగొండలో నాలుగు సెం.మీ, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు, ఆదిలాబాద్, ఉట్నూర్, ఖమ్మం జిల్లా కొణిజెర్లలో మూడు సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా తాడ్వాయిలో రెండు సెం.మీ వర్షం కురిసింది.

# ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

- **అసత్య ప్రచారాలతో కార్మికులను తప్పుదోవ పట్టించొద్దు: మంత్రి పొన్నం**
- **జులై జీతాల నుంచే 11 శాతం పీఆర్సీ అమలు**

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్::**

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు.

ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు, ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో దాదాపు 14 గంటల పాటు చర్చించి ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించామని తెలిపారు.

**11 శాతం పీఆర్సీ అమలు**

యాజమాన్యం పరిధిలోని 29 అంశాల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ విలీనం అంశాలపై కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. 11 శాతం పీఆర్సీని జులై నెల జీతాల నుంచే అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

**గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీ**

ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం ప్రతినిధులు ఉండాలని అన్ని సంఘాలు ఏకగ్రీవంగా నిర్ణయించాయని మంత్రి తెలిపారు. అందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తైన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎదురైన సమస్యలు తెలంగాణలో తలెత్తకుండా కార్మిక సంఘాల భాగస్వామ్యంతోనే విలీన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

# మహిళల భద్రతలో పోలీసులదే కీలక పాత్ర

- **పోష్ చట్టంపై పూర్తి అవగాహన ఉండాలి: డీజీపీ చారు సిన్హా**
- **112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలకు ప్రత్యేక అవగాహన సదస్సు**

**హైదరాబాద్, జూన్ 27 సిరి న్యూస్:**

పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడంలో పోలీసు అధికారుల పాత్ర అత్యంత కీలకమని సీఐడీ డీజీపీ చారు సిన్హా పేర్కొన్నారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్)పై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని భావి పోలీసు అధికారులకు సూచించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో శనివారం 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీల కోసం నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పని ప్రదేశాల్లో మహిళల భద్రత, పోష్ చట్టం అమలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలపై చర్చించారు.

**అన్ని రకాల వేధింపులపై అప్రమత్తత అవసరం**

ఉద్యోగ స్థలాల్లో మహిళలు ఎదుర్కొనే వేధింపులు కేవలం భౌతికంగానే కాకుండా అనుచిత పదజాలం, అసభ్యకర ప్రవర్తన, సైగలు వంటి అనేక రూపాల్లో ఉంటాయని చారు సిన్హా తెలిపారు. ఇవన్నీ లైంగిక వేధింపుల పరిధిలోకే వస్తాయని స్పష్టం చేశారు. మహిళలు తమకు ఉన్న చట్టపరమైన హక్కులను ధైర్యంగా వినియోగించుకునేలా పోలీసులు అండగా నిలవాలని సూచించారు.

**చట్టాలపై పూర్తి అవగాహన అవసరం**

విమెన్ సేఫ్టీ విభాగం కౌన్సిలర్ ఇషా శర్వాణి మాట్లాడుతూ మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ విషయంలో పోలీసులకు చట్టాలపై పూర్తి అవగాహన అవసరమని చెప్పారు. సమాజంలో కూడా ఈ అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ దశలోనే ఇలాంటి చట్టాలపై స్పష్టత పెంపొందితే భవిష్యత్తులో కేసుల దర్యాప్తు సమర్థంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# 'రైతు' డిస్కమ్ ఇక 'రూరల్' డిస్కమ్..!

**మొదటిపేజీ తరువాయి**

నిలదీశారు. తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిర్వహించిన ప్రజా అభిప్రాయ సేకరణలోనూ దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కేవలం నష్టాలు వచ్చే వ్యవసాయం, మిషన్ భగీరథ, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ వంటి 42 శాతం వాటా సర్వీసులతో డిస్కమ్ నడవడం అసాధ్యమని ఈఆర్సీ సైతం భావించడంతో.. కొత్త సంస్థకు రావాల్సిన లైసెన్స్ ప్రక్రియ నిలిచిపోయింది.

**మారిన పంథా..**

కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ఎదురవుతున్న సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు యాజమాన్యం పంథా మార్చింది. ప్రజల్లో, ఉద్యోగుల్లో ఉన్న ఆలోచనలను తెలుసుకునేందుకు విద్యుత్ నిపుణుల సాయంతో 'గత ప్రతిపాదనలు ప్రస్తుత సవరణలు' పేరుతో ఒక అంతర్గత ప్రకటనను సామాజిక మాధ్యమాల్లో లీక్ చేసింది. ప్రభుత్వం లేదా యాజమాన్యం పేరు లేకుండా జరిగిన ఈ ప్రచారం ద్వారా క్షేత్రస్థాయి అభిప్రాయాలను సేకరించారు. గతంలో మాదిరిగా కొత్త సవరణలపై పెద్దగా వ్యతిరేకత లేదన్న సంకేతాలు రావడంతో, ఈఆర్సీ నుండి లైసెన్స్ పొందేందుకు యాజమాన్యం మళ్లీ ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది.

**గ్రామీణ ప్రాంతాలన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి..**

నూతన సవరణల ప్రకారం.. రైతు డిస్కమ్ కేవలం వ్యవసాయ కనెక్షన్లకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలలోని విద్యుత్ సర్వీసులన్నింటినీ తన పరిధిలోకి తీసుకోనుంది. దీనివల్ల పల్లెల్లోని 11 కేవీ, 33 కేవీ లైన్ల నిర్వహణ అంతా కొత్త డిస్కమ్ చేతుల్లోకే వస్తుంది. గతంలో వ్యవసాయానికి ఒక డిస్కమ్, గృహ అవసరాలకు మరో డిస్కమ్ ఉంటే.. లైన్ల అంతరాయాలు, నిర్వహణ సమయంలో ఇరు సంస్థల ఉద్యోగుల మధ్య సమన్వయం ఎలా కుదురుతుందన్న సాంకేతిక ప్రశ్నకు ఈ సవరణతో చెక్ పడినట్లయింది. ఈ కొత్త విభజన వల్ల పాత డిస్కమ్‌లు (ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్) కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం కానున్నాయి.

**ఎన్పీడీసీఎల్ పరిధిలోనే అత్యధిక వాటా..**

తెలంగాణ నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధిలోనే అత్యధికంగా వ్యవసాయ కనెక్షన్లు, గ్రామీణ ప్రాంతాలు ఉండటంతో.. కొత్త డిస్కమ్‌లో మెజారిటీ వాటా ఎన్పీడీసీఎల్ నుండే బదిలీ కానుంది. అయితే, ఈ విభజనతో కొత్త డిస్కమ్‌పై అప్పుల భారం కూడా భారీగా పెరగనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆదాయం తక్కువ, నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల బాధ్యతను మోయడం కొత్త సంస్థకు సవాల్‌గా మారనుంది.

**'రెడ్కో' కేంద్రంగా కొత్త పరిపాలన**

నూతనంగా ఏర్పాటు కానున్న ఈ గ్రామీణ/రైతు డిస్కమ్‌కు లైసెన్స్ మంజూరు కాగానే, దీని పరిపాలనా విభాగాన్ని హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన 'రెడ్కో' కార్యాలయానికి మార్చనున్నారు. ఇప్పటికే రైతు డిస్కమ్




సీఎండీగా ఉన్న ముషారఫ్ ఫరూఖీకి రెడ్కో అదనపు బాధ్యతలను సైతం అప్పగించడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఏది ఏమైనప్పటికీ.. ఎన్నో అభ్యంతరాలు, నిరసనలు, ప్రతిపక్షాల ఆరోపణల సవాళ్లను దాటుకుని, రైతు డిస్కమ్ పేరుతో తెలంగాణలో సరికొత్త 'గ్రామీణ విద్యుత్ డిస్కమ్' త్వరలోనే పట్టాలెక్కబోతోంది.

## చట్టసభల్లో మహిళలకు 33%రిజర్వేషన్ కల్పించాలి

**హైదరాబాద్, జూన్ 27 సరి న్యూస్:**

జనాభా లెక్కలు, డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో సంబంధం లేకుండా, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలలో 33% మహిళా రిజర్వేషన్ల చట్టం, 2023 (ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా)ను తక్షణమే, బేషరతుగా అమలు చేయాలని వివిధ మహిళా హక్కుల సంఘాలు, లౌకిక పార్టీలకు చెందిన సుమారు 100 మంది ప్రతినిధులతో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల జాతీయ కూటమితో సంఘీభావంగా, తెలంగాణలోని మహిళా హక్కుల, ఫెమినిస్ట్ సంఘాలు ఈ సమావేశాన్ని నిర్వహించాయి. కేంద్రంలోని అధికార పార్టీ డీలిమిటేషన్ బిల్లు ద్వారా పార్లమెంటరీ విస్తరణ అనే సమాఖ్యవ్యతిరేక, అప్రజాస్వామిక ఎజెండాను కొనసాగించకూడదని, మహిళా రిజర్వేషన్లను ఒక ఆయుధంగా వాడుకోవడం మానుకోవాలని స్పష్టం చేశారు. సీనియర్ విద్యావేత్తలు, కార్యకర్తలైన ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ రమా మెల్కోటే కీలకోపన్యాసం చేస్తూ మహిళా రిజర్వేషన్ల కోసం దశాబ్దాలుగా సాగుతున్న పోరాటాన్ని వివరిస్తూ, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన మహిళలు రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తూ పార్లమెంటులో, రాష్ట్ర శాసనసభలలో గణనీయ సంఖ్యలో ఉంటే, ప్రజా విధానాలు, పరిపాలనలో సానుకూల మార్పు వస్తుందని నొక్కి చెప్పారు.

## హెచ్ఆర్ఏ అమలు చేయాలి

### పిఆర్టీయు ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి



**మెదక్ జూన్,27(సిరి న్యూస్)**

మనోహరబాద్ మండలం హైదరాబాద్ జీహెచ్ఎంసి పరిధి ఫెరిఫరాలో వచ్చే అవకాశం ఉన్నందున ఆ మండలానికి గల 24% హెచ్ఆర్ఏ వర్తింపచేయాలనీ పిఆర్టీయు ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గారికి వినతి పత్రం సమర్పించారు.జిల్లాలో సెన్సెస్ డ్యూటీ నిర్వహించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు రావాల్సిన రెనిమరేషన్ గురించి అడగగా వెంటనే స్పందించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని త్వరలోనే అమౌంట్ క్రెడిట్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు .ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేడి సతీష్ రావు, సామ్యా నాయక్, గౌరవ అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరేశం, ప్రమోద్, మనోహరాబాద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజుగౌడ్, నాగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు భూపాల్ రావు, నాగేశ్వరరావు, విట్టల్ , కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, మరియు ఉపాధ్యాయులు.తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తికి అండ!

### చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**జిన్నారం జూన్ 26 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ వార్డు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. స్వయం సహాయక గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిర మహిళా శక్తి చీరలను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతిలో స్వయం సహాయక సంఘాలు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలతో మరింత అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పిడుగు పడి వ్యక్తి మృతి

**వెల్దుర్తి,జూన్ 27,(సిరి న్యూస్):**



వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన పనిగంటి మైసయ్య చిన్న శంకరంపేట మండలం దరిపల్లి శివారులో, శనివారం మధ్యాహ్నం పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం.. వెల్లుర్తి గ్రామానికి చెందిన పనిగంటి మైసయ్యా (42)వ్యవసాయ బోరు వద్ద బోరు మరమ్మతులు చేస్తుండగా, అకాల వర్షం పడడంతో చెట్టు కింద తలదాచుకున్నాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు విషయం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

## 2 బీహెచ్ కే కాలనీలో ఎస్ ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

**రామచంద్రపురం, జూన్ 27 (సిరి న్యూస్):**



ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శనివారం కొల్లూరులోని 2 బీహెచ్కే గృహ సముదాయంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓ వెంకటేశ్వర్‌రావు, తహశీల్దార్ సరస్వతి పాల్గొని ఫారాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తూ, వాటిని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించారు. ఫారాల నింపే విధానం, జత చేయాల్సిన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను ధ్రువీకరించి ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించాలని కోరారు.కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు నీడ ఇందిరమ్మ ఇల్లు.

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.
- ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- గుడిసెలలో నివాసం ఉండే వారిని గుర్తించి నివేదిక అందించాలి.
- ప్రత్యేక అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.





**మెదక్,జూన్, 27(సిరి న్యూస్)**

నిరుపేదలకు నీడ కల్పించాలన్నా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాకు మంజూరైన (8953) ఇళ్లకు గాను 81. శాతంతో (7271) ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పర్యటించి, నిర్మాణాలు వేగవంతం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం స్టేజీలవారీగా ఇళ్లను తుది దశకు పురోగతిలోకి తీసుకురావాలన్నారు.ఇసుక, గ్రావెల్ విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ అధికారులను ఆదేశించారు.ఇప్పటికీ ప్రారంభించని ఇండ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 వరకు పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లు పూర్తి అవుతున్నాయన్న అంశం మీద సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేదలు మహిళా స్వయం సహాయక సభ్యులుగా ఉన్నట్లయితే డిఆర్డిఓ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఓ ను ఆదేశించారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇప్పుడు గుడిసెలో నివసించే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు పోతున్నామన్నారు..

**రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి**

ప్రభుత్వ ఆదేశాలతో అన్ని గ్రామాలు,నగర జనాభా ప్రాతిపదికన ఇళ్లు కేటాయించి లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకుగాను ప్రత్యేక అధికారులు జిల్లాలోని ఆయా మండలాల్లో గుడిసెల్లో నివసించే వారిని త్వరితగతిన గుర్తించి నివేదికలు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్ డిఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు..!

- ఓటు కలిగిన ప్రతి పౌరుడు 'సర్' ప్రక్రియలో భాగస్వామ్యం కావాలి.
- మెదక్ పట్టణంలో ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ.
- మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్.

**మెదక్ జూన్,27 (సిరి న్యూస్)**




ఓటు హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని,ఓటు కలిగిన ప్రతి పౌరుడు ఎస్ ఐ ఆర్ (సర్) ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ పేర్కొన్నారు.మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు శనివారం మెదక్ పట్టణంలోని పిట్లం బేస్ ప్రాంతం, వార్డు నెం.14, 15లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం నిర్వహించారు.బీఎల్ఓ నీలిమతో కలిసి ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేశారు.వార్డు సభ్యులతో పాల్గొని ప్రజలకు ఫారాలు నింపే విధానం, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ ఓటు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములై, ఫారాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. తొందరపాటుకు తావివ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలని కోరారు.వార్డు నెం.14, 15 పరిధిలోని ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో పాల్గొనాలని, ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గంగాయిపల్లి అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి

- ఐదుగురు అరెస్టు.. రూ.11,230 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**శివంపేట్ జూన్ 27 (సిరి న్యూస్ )**





శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడి నిర్వహించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన వారిలో ఇటిక్యాల రేవంత్ రెడ్డి, బానోత్ కంద్యా, నల్ల పేరమాన్లు, జిట్ట సత్యనారాయణ, ఎ. ప్రశాంత్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.11,230 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# భానూరులో కాంగ్రెస్‌కు షాక్..

- బీఆర్ఎస్‌లో చేరిన కీలక నాయకులు, వార్డు సభ్యురాలు..
- హరీష్ రావు సమక్షంలో గులాబీ కండువా..
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీఎంఆర్..

**పటాన్‌చెరు, జూన్ 27 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు ప్రవళిక నరేందర్‌తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పార్టీకి చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ విజయాన్ని సాధించిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని, ఈ చేరికలతో భానూరు గ్రామంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.భానూరు గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు ప్రవళిక నరేందర్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాగర్, జిల్లా కార్యదర్శి కుమ్మరి శివయ్య తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీధర్ చారి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త పై కొత్త సమరం.!

- చెత్తను నాలుగు విభాగాలుగా విడదీసి తీసుకోవాలి.
- జూలై 1 నుంచి చెత్తను వేరు చేసి ఇవ్వాలి.
- సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్-2026 అమలుకు కార్యాచరణ.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్,జూన్,27(సిరి న్యూస్)**



జూలై 1 నుండి చెత్తను వేరు చేసి నాలుగు విభాగాలుగా విభజించి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘన వ్యర్థాల నిర్వహణ పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జూలై ఒకటవ తేదీ నుంచి చెత్తను వేరు చేయకుండా ఇవ్వరాదన్నారు.ఇండ్లలోని వ్యర్థాలను తడి చెత్తను గ్రీన్ డబ్బాలో, పొడి చెత్తను బ్లూ డబ్బాలో, సానిటరీ చెత్తను రెడ్ డబ్బాలో, హానికరమైన చెత్తను బ్లాక్ డబ్బాలలో విడదీసి, వేరువేరుగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హోటల్స్,హాస్టల్స్, పరిశ్రమలు,రెస్టారెంట్లు, ధాబాలు, హాస్పిటల్స్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సొంతంగా వ్యర్థాల నిర్వహణ చేసుకోవాలన్నారు. వాటన్నింటికీ ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త సేకరణ కోసం నాలుగు వేరు వేరు డబ్బాలు ఏర్పాటు చేయాలన్నారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్–2026 అమలుకు కార్యాచరణ.. శాఖల సమన్వయం తప్పనిసరి జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు–2026ను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేయాలి

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**పాపన్నపేట జూన్ 27 (సిరి న్యూస్) :**





కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ నిర్వహణను సమగ్రంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, స్వాధీన వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి, బస్వరాజ్ కు రివర్డ్ మంజూరు చేశారు, శాఖ అందించిన సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి అన్ని రకాల విధుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, ప్రస్తుతం నేర్చుకుంటున్న అంశాలు సేవా కాలమంతా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి కేసులో శాస్త్రీయ, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేక కార్యాచరణతో త్వరగా పరిష్కరించాలని, ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమ గ్రామాలపై పూర్తి అవగాహనతో గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్–2.0, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజా శేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ప్రభుత్వం..

- 117 మందికి రూ.46.07 లక్షల సీఎం సహాయనిధి..
- మంచిర్యాలలో రికార్డు స్థాయిలో 2,911 చెక్కుల పంపిణీ..
- ఆపదలో ప్రజలకు ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్..
- లక్షెట్టిపేటలో ఘనంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం..

**మంచిర్యాల, జూన్ 27 (సిరి న్యూస్)**



ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ కార్యక్రమం మంచిర్యాల నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. లక్షెట్టిపేట పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా దండేపల్లి మండలం, లక్షెట్టిపేట మండలం, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధికి చెందిన 117 మంది లబ్ధిదారులకు రూ.46,07,600 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాల నియోజకవర్గంలో ఇప్పటివరకు 2,911 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి, నర్సయ్య, ఉప చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి, వెంకటస్వామి గౌడ్, జిల్లా రవాణా శాఖ సభ్యుడు అంకతి శ్రీనివాస్, జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘం అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, జిల్లా నాయకులు చల్లా నాగభూషణం, పూర్ణచంద్రరావు, దండేపల్లి మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, లక్షెట్టిపేట పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ అలీ, లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు, సర్పంచ్ నలిమెల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆరీఫ్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, సహనియామక సభ్యులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల ముఠా అరెస్ట్..

- నకిలీ పత్తి విత్తనాల ముఠా బట్టబయలు..
- 100 కిలోల విత్తనాలు స్వాధీనం..
- ముగ్గురు నిందితులు అరెస్ట్..
- రైతులను మోసగాళ్లపై ఉక్కుపాదం..

**మంచిర్యాల జూన్ 27 (సిరి న్యూస్)**



రైతులను నకిలీ పత్తి విత్తనాలతో మోసం చేస్తున్న ముఠాపై మందమర్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సుమారు 100 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి పోలీసు ఉపనిరీక్షకుడు నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీసులు కలిసి శనివారం ఉదయం జాతీయ రహదారి, 363లోని అందుగులపేట్ శ్రీ కన్వెన్షన్ హాల్ సమీపంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను నిలిపి తనిఖీ చేయగా, వారి వద్ద ఎలాంటి ధ్రువీకరణ లేబుళ్లు, బిల్లులు లేని సుమారు 100 కిలోల లూజ్ పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. ఈ కేసులో మాకినేని రాఘవేంద్ర (మధుర్‌నగర్, పాత మంచిర్యాల), కట్ట నరేష్, పుట్టగంటి పవన్ కుమార్ (ఇద్దరూ బురదగూడెం, మందమర్రి)లను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న అపాచీ, టీవీఎస్ ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అమాయక రైతులను నకిలీ విత్తనాలతో మోసం చేసే అక్రమార్కులపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగించే ఈ అక్రమ రవాణా ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు ఉపనిరీక్షకుడు నరేష్‌తో పాటు కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, చైతన్య, మహేందర్, సంతోష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

## ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరించాలి..

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే సత్తయ్య వినతి**



**పటాన్‌చెరు, జూన్ 27 (సిరి న్యూస్):**

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2లో మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ వరకు మెట్రో మార్గాన్ని విస్తరించేలా చర్యలు తీసుకోవాలని మాజీ సంగారెడ్డి ఎమ్మెల్యే సత్తయ్య కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, గతంలో మియాపూర్–పటాన్‌చెరు–ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఫేజ్–2లో ఈ మార్గాన్ని ఇక్రిసాట్ వరకు మాత్రమే ప్రతిపాదించడం వల్ల పటాన్‌చెరు, ఇస్నాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరే అవకాశం ఉండదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.పటాన్‌చెరు–పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం, ఐఐటీ హైదరాబాద్, గీతం యూనివర్సిటీతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మియాపూర్–పటాన్‌చెరు–ఇస్నాపూర్ మెట్రో కారిడార్‌ను విస్తరించాలని కోరారు. ఈ మార్గం అమలులోకి వస్తే వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించడంతో పాటు జాతీయ రహదారి–65పై ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.మియాపూర్–పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రో మార్గాన్ని హైదరాబాద్ మెట్రో ఫేజ్–2లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సత్తయ్య కోరారు.ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ సాధన సమితి వ్యవస్థాపక సభ్యులు రుద్రారం శంకర్, మెట్టు శ్రీధర్, సురేందర్, సాయితేజ పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో ఎస్ఐఆర్ షురూ..

**బెల్లంపల్లిలో ఎస్ ఐఆర్ కు ఘన శ్రీకారం..**

**కొత్త ఓటరు నమోదుకు నాయకుల పిలుపు..**

**ఓటరు వివరాల సవరణపై ప్రత్యేక దృష్టి..**

**బస్తీవాసుల భాగస్వామ్యంతో విజయవంతమైన ప్రారంభం..**



**మంచిర్యాల జూన్ 27 (సిరి న్యూస్)**

ఓటరు నమోదు, వివరాల సవరణపై ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిస్తూ ప్రత్యేక ఓటరు సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియను బెల్లంపల్లి బస్తీలో ఘనంగా ప్రారంభించారు. ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు వివరాలను సరిచేసుకోవాలని నాయకులు సూచించారు. బెల్లంపల్లి శాసన సభ్యుడు వినోద్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు ఆధ్వర్యంలో, 19వ వార్డు బస్తీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాంపెల్లి శ్రీనివాస్ నేతృత్వంలో బెల్లంపల్లి బస్తిలోని 60, 62 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు సర్వే (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ కార్యక్రమంలో ప్రతి అర్హుడూ చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి అనురాధ (60వ బూత్), బూత్ స్థాయి అధికారి నర్మద (62వ బూత్), బూత్ స్థాయి ప్రతినిధి రంజిత్ కుమార్, కాంపెల్లి శివకుమార్, సీనియర్ నాయకుడు దుర్గం మహేందర్, మైనార్టీ నాయకుడు అబ్దుల్ జాబి ఇమ్ము, యువజన నాయకులు రామిల్ల ప్రదీప్, అక్కపాక రామ్ నరేష్, బస్తీవాసులు పాల్గొని ప్రత్యేక ఓటరు సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఓటరు జాబితా నమోదు, సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

## హాస్టల్ ఆకస్మిక తనిఖీ

**తూప్రాన్ జూన్ 27 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ టోల్ గేట్ వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలను శనివారం ప్రత్యేక అధికారి డిప్యూటీ తాసిల్దార్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు తెలంగాణ లోని గురుకుల పాఠశాల లకు స్పెషల్ ఆఫీసర్లు నియామకం శనివారం విడుదల కాగా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ శివారులో గల తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలకు తూప్రాన్ డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న శ్రీకాంత్ ను స్పెషల్ ఆఫీసర్ గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకాలు శనివారం జరిగాయి ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణం వంటగది శుభ్రత స్టాక్ రూమ్‌లు విద్యార్థులు నిద్రించే గదులు బాత్ రూమ్ సౌకర్యాలు ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణం సుచి శుభ్రతలతో ఉండాలని రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంటగది పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు విద్యార్థులతో మాట్లాడుతూ వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు ఆహార విషయంలో విద్యా బోధన విషయంలో కానీ ఎలాంటి అసౌకర్యాలు కలిగినట్లయితే వెంటనే తమ దృష్టికి తేవాలని స్పెషల్ అధికారి శ్రీకాంత్ విద్యార్థులకు సూచించారు

## ఏలుకపల్లి గ్రామంలో గ్రామ సభ

**పారిశుద్ధ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**



**వెల్దుర్తి,జూన్ 27,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం ఎలుక పల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ పావని శివలింగం అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఇట్టి గ్రామ సభకు గ్రామస్తులు హాజరై,పంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ పావని అన్నారు. అంతేకాకుండా గ్రామంలో చెత్త సేకరణకు టాక్టర్ కావాలని గ్రామ వార్డు సభ్యులు సర్పంచ్ గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి కోరారు. వర్షాకాలం మొదలు కావడంతో గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు కూడా త్వరగాతిన పరిష్కరించాలని గ్రామస్తులు పంచాయతీ పాలకవర్గానికి కోరారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల అమలుతీరును పంచాయతీ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. కొన్నిచోట్ల త్రాగుడు సమస్యలు కూడా ఉన్నాయని గ్రామస్తులు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ వెనువెంటనే సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పావని శివలింగం, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, కార్యదర్శి కృష్ణ, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజ్యాధికార రణభేరి..

**భువనగిరి సభకు భారీ సమీకరణ పిలుపు..**

**రాజ్యాధికార సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ..**

**బహుజన ఐక్యతే టీఆర్ పీ లక్ష్యం..**

**మంచిర్యాల నుంచి భారీ తరలింపునకు పిలుపు..**



**మంచిర్యాల, జూన్ 27 (సిరి న్యూస్)**

జూలై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ అల్లి సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి, సహ కన్వీనర్ రంజిత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమ్ముల ప్రవీణ్ రాజ్ మాట్లాడుతూ, బహుజనుల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరి సభ చారిత్రాత్మకంగా నిలవనుందని అన్నారు. సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కోసం నిర్వహిస్తున్న ఈ సభకు మంచిర్యాల జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, బహుజన ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంజిత్, రవీంద్ర, మహేష్ వర్మ, దినకర్, శివ, రవీందర్, రూప, దిలీప్, లతీఫ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు వరంగా 'ఇందిరమ్మ చీరలు'

- చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్పా నాగేష్ యాదవ్



**రామచంద్రాపురం, జూన్ 27 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం జీహెచ్ఎంసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పా నాగేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన మహిళలందరూ ఇందిరమ్మ చీరలను స్వీకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల మహిళలు అందుబాటులో ఉన్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత ముందుకు సాగాలని సూచించారు.పుష్పా నాగేష్ యాదవ్ మాట్లాడుతూ, మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మహిళల సాధికారతకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ జ్యోతి, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం నుంచి పీహెచ్‌డీ వరకూ..

## డాక్టరేట్..శేఖర్ సక్సెస్ స్టోరీ

- పేద కుటుంబం...డాక్టరేట్ విజయగాథ..
- రైతు కూలి కుటుంబం నుంచి డాక్టరేట్ వరకు..
- ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన పూర్తి..
- పట్టుదలతో సాధించిన విద్యా విజయం..
- వినియోగదారుల ఆర్థిక విధానాలపై అధ్యయనం..
- గ్రామ యువతకు ప్రేరణగా నిలిచిన కథ..
- సారంగపల్లిలో ఆనంద వాతావరణం..





**మంచిర్యాల జూన్ 27 (సిరి న్యూస్)**

సాధారణ కుటుంబంలో పుట్టి, అసాధారణ లక్ష్యాలను సాధించడం చాలా అరుదు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రామగిరి శేఖర్ ఆ అరుదైన కోవకు చెందిన యువకుడిగా నిలిచారు. రైతు కూలి కుటుంబ నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులు, పరిమిత వనరులు ఉన్నప్పటికీ, విద్యనే జీవిత లక్ష్యంగా చేసుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగిన ఆయన, ఇప్పుడు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ (పీహెచ్‌డీ) సాధించి గ్రామానికే కాకుండా జిల్లా మొత్తానికి గర్వకారణంగా మారారు. చిన్ననాటి నుంచి ఎదురైన కష్టాలు ఆయనను వెనక్కి నెట్టలేదు. ప్రతి అడ్డంకిని అవకాశంగా మార్చుకుని, చదువులో ముందడుగు వేస్తూ, పట్టుదలతో తన లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రయాణించారు. సమాజంలో మార్పు రావాలంటే విద్యే ప్రధాన ఆయుధమని నమ్మిన ఆయన, అదే దిశగా తన జీవనాన్ని మలుచుకున్నారు.

**పేద రైతు కూలి కుటుంబం నుంచి డాక్టరేట్ వరకు సాగిన స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం..**

సారంగపల్లి గ్రామానికి చెందిన రామగిరి లింగయ్య, రత్న దంపతుల కుమారుడైన డాక్టర్ రామగిరి శేఖర్ చిన్న వయసులోనే ఆర్థిక కష్టాలను అనుభవించారు. పాఠశాల దశ నుంచే కుటుంబ బాధ్యతల మధ్య చదువును కొనసాగించడం ఆయనకు సులభం కాలేదు. అయినప్పటికీ చదువుపై ఉన్న మమకారం, లక్ష్యసాధనపై ఉన్న పట్టుదల ఆయనను ముందుకు నడిపించింది. పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి దశలో కష్టాలు ఎదురైనా, చదువును ఆపకుండా కొనసాగించడం ఆయన ప్రత్యేకత. అనేక సందర్భాల్లో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, తన లక్ష్యాన్ని వదలకుండా కృషి చేయడం ఆయన జీవితాన్ని ప్రత్యేకంగా నిలిపింది.

**ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వ్యాపార నిర్వహణ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి..**

డాక్టర్ రామగిరి శేఖర్ తన ఉన్నత విద్య ప్రయాణాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొనసాగించారు. వ్యాపార నిర్వహణ విభాగంలో ప్రొఫెసర్ మార్గదర్శకత్వంలో ఆయన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. అకాడమిక్ రంగంలో క్రమశిక్షణ, పరిశోధన పట్ల నిబద్ధత, లోతైన అధ్యయనం ఆయన విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఆయన పరిశోధన కేవలం డిగ్రీ కోసం కాకుండా, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండేలా రూపొందించడం విశేషం.

**హైదరాబాద్ ఎలక్ట్రానిక్ రిటైల్ రంగంలో వినియోగదారుల ఆర్థిక విధానాలపై లోతైన పరిశోధన..**

తన పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా డాక్టర్ శేఖర్ హైదరాబాద్ నగరంలోని ఎలక్ట్రానిక్ రిటైల్ రంగాన్ని అధ్యయనం చేశారు. వినియోగదారుల దీర్ఘకాలిక వస్తువుల కొనుగోలు విధానాల్లో ఆర్థిక అంశాలు ఎలా ప్రభావం చూపుతున్నాయి అనే విషయంపై ఆయన లోతైన విశ్లేషణ చేశారు.ఈ పరిశోధన ఆధునిక మార్కెట్ పరిస్థితులు, వినియోగదారుల ప్రవర్తన, ఫైనాన్స్ సౌకర్యాల ప్రభావం వంటి అంశాలను శాస్త్రీయంగా అర్థం చేసుకునేలా చేసింది. అకాడమిక్ వర్గాల్లో ఈ పరిశోధనకు మంచి గుర్తింపు లభించింది.

**డా. బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సాగిన జీవన ప్రస్థానం..**

సమానత్వం, విద్యా హక్కుల కోసం పోరాడిన డా. బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని డాక్టర్ శేఖర్ తన జీవితాన్ని నిర్మించుకున్నారు. కష్టాల మధ్య కూడా చదువును ఆపకుండా కొనసాగించడం ద్వారా ఆయన యువతకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పరిస్థితులు ఎలా ఉన్నా పట్టుదల ఉంటే విజయం తప్పకుండా సాధ్యమే" అనే నమ్మకాన్ని ఆయన తన జీవితంతో నిరూపించారు. డాక్టర్ రామగిరి శేఖర్ సాధించిన ఈ విజయంతో సారంగపల్లి గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. గ్రామం మొత్తం ఆయనపై గర్వం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు, చిన్ననాటి స్నేహితులు, బంధువులు, అలాగే ఆయన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆయన విజయంపై గర్వపడుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడే స్వభావం ఉన్న శేఖర్ నేడు ఈ స్థాయికి చేరడం మా అందరికీ గర్వకారణం అని వారు భావోద్వేగంతో అభినందనలు తెలిపారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి అసాధారణ శిఖరాలను అధిరోహించిన డాక్టర్ రామగిరి శేఖర్ జీవితం, కష్టపడితే ఏ లక్ష్యమైనా సాధ్యమే అనే సత్యాన్ని మరోసారి బలంగా నిరూపించింది..



# సిగాచీ బాధితులకు పూర్తి న్యాయం చేయాలి..

- హరీష్ రావు పర్యటన నేపథ్యంలో పోస్టర్ ఆవిష్కరణ

**పటాన్‌చెరు, జూన్ 27 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించనున్న సంస్మరణ సభ పోస్టర్‌ను శనివారం పాశంమైలారంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిగాచీ దుర్ఘటన జరిగి ఏడాది పూర్తవుతున్నప్పటికీ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నష్టపరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు వెంటనే పూర్తి నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నెల 30న మాజీ మంత్రి హరీష్ రావు పటాన్‌చెరుకు వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించి సంస్మరణ సభలో పాల్గొంటారని తెలిపారు. బాధిత కుటుంబాలు, కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్వీ నాయకుడు మేరాజ్ ఖాన్, ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ కిషోర్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి, వడ్డెగడ్డ రాజు, గొంగోళ్ల నవీన్ రెడ్డి, పెలిమెల వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బండ రాజు, ఐలాపూర్ మాణిక్ యాదవ్, పాశంమైలారం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందోలు చెరువుకట్టకు వెయ్యి ట్రిప్పలకు అనుమతి ఉందా?

- మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్లు

**జోగిపేట. జూన్ 27, (సిరి న్యూస్)ः :**

బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అందోలు పెద్ద చెరువు కట్టకు వెయ్యి టిప్పర్ల మట్టిని ఏ అనుమతి తీసుకొని 1141 సర్వే నంబరు నుంచి తరలించారో బయటపెట్టాలని అందోలు–జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ తోట రామకృష్ణ, మాజీ కౌన్సిలర్‌లు ఆర్. ప్రదీప్‌గౌడ్, టి.హరికృష్ణాగౌడ్, అందోలు మాజీ సర్పంచ్ కే.శ్రీనివాస్ యాదవ్‌లు డిమాండ్ చేసారు. శనివారం అందోలులో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. రూ.80 కోట్లతో చేపడుతున్న జోగిపేట–అజ్జమర్రి రోడ్డు నిర్మాణం పనులను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ భూమి అయిన 1141 సర్వే నెంబర్ లో గల మట్టిని తరలిస్తే తప్పేంటని వారు ప్రశ్నించారు. మంత్రి చేపడుతున్న అభివృద్దిని చూసి ఓర్వలేకనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిలో నుంచి విచ్చలవిడిగా మట్టిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని వారు ఆరోపించారు. అందోలు శివారు నుంచి అందోలు అంబేద్కర్ విగ్రహం వరకు డివైడర్ ఏర్పాటు చేసి అవసరమైన మట్టిని ప్రభుత్వ భూమి నుంచే వాడుకున్నారని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అయినా మే 22 రోజున అప్లికేషన్ పెట్టుకోవడం జరిగిందని అధికారుల అనుమతితోనే ప్రభుత్వ పనులకు వినియోగిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మొరం అక్రమ రవాణా చేసారని అధికార పార్టీపై చేసపిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో వాహనాలను అడ్డుకున్న వారే అడ్డగోలుగా 1141 సర్వే నంబరులోని భూమిలో నుంచి మట్టిని తరలించుకుపోయారని వారు ఆరోపించారు.



# గర్భాశయం వెలుపల పిండం..

- ప్రాణాలు కాపాడిన మెడికవర్ వైద్యులు

**రామచంద్రపురం, జూన్ 27 (సిరి న్యూస్):**

గర్భాశయం వెలుపల పిండం పెరగడం (ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ)తో తీవ్ర అంతర్గత రక్తస్రావానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన 34 ఏళ్ల మహిళకు చందానగర్‌లోని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. సకాలంలో చికిత్స అందించడంతో ఆమె పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు.ఈ విషయాలను శనివారం మెడికవర్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు.కొన్ని రోజులుగా నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, నీరసం, అస్వస్థతతో బాధపడుతున్న మహిళను కుటుంబ సభ్యులు అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. నిర్వహించిన పరీక్షల్లో గర్భాశయం వెలుపల పిండం పెరగడంతో పాటు ఫెలోపియన్ ట్యూబ్ పగిలిపోవడం వల్ల కడుపులో భారీగా రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వెంటనే రక్తాన్ని సమకూర్చి అత్యవసర శస్త్రచికిత్స చేపట్టారు.డా. భావ్య నేతృత్వంలోని ప్రసూతి, గైనకాలజీ వైద్య బృందం పగిలిపోయిన ఫెలోపియన్ ట్యూబ్‌ను తొలగించి కడుపులో పేరుకుపోయిన రక్తాన్ని తొలగించి రక్తస్రావాన్ని పూర్తిగా నియంత్రించింది. అనంతరం డా. రాజు ఆధ్వర్యంలోని క్రిటికల్ కేర్ బృందం ఐసీయూలో చికిత్స అందించింది. వివిధ విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమిష్టి కృషితో




మహిళ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి పూర్తిగా కోలుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ మహిళల ప్రాణాలకు ముప్పు కలిగించే అత్యవసర పరిస్థితి అని తెలిపారు. నెలసరి ఆలస్యం, తీవ్రమైన కడుపు నొప్పి, తలతిరగడం, బలహీనత వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని సకాలంలో గుర్తించి అత్యవసర చికిత్స అందిస్తే ప్రాణాపాయాన్ని నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు.





# చలికాలంలో ఈ ఆసనాలు..

## అనేక ఆరోగ్య ప్రయోజనాలు

చలికాలంలో శారీరక శ్రమ తగ్గడం, జీవక్రియలో మార్పులు, చలి వాతావరణం, తక్కువ పగటి వేళల కారణంగా సౌకర్యవంతమైన ఆహారం తీసుకోవడం వంటి వివిధ కారణాల వల్ల శీతాకాలంలో బరువు పెరగడం సాధారణం. చల్లగా ఉన్న సమయంలో మనం కదలకపోవడం వల్ల శరీరం సహజంగా శక్తిని ఆదా చేస్తుంది. అధిక కేలరీలు, వేడిగా ఉండే ఆహారాలను తినాలనే కోరిక పెరుగుతుంది. సూర్యరశ్మి మీ శరీరంలో సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఇది అతిగా తినడాన్ని ప్రేరేపించే మానసిక మార్పులకు దారితీస్తుంది. చలికాలంలో జీవక్రియను పెంచడం, మానసిక స్థితిని మెరుగుపరచడం, బరువు నిలుపుదలకి దోహదపడే కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను తగ్గించుకోవడానికి యోగా ప్రభావవంతమైన మార్గంగా పనిచేస్తుంది. రెగ్యులర్ యోగాభ్యాసం శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. మంచి ఆహారపు అలవాట్లకు మద్దతు ఇస్తుంది. చలికాలంలో బరువు పెరగకుండా ఉండేందుకు చేసే యోగాసనాల గురించి తెలుసుకోండి.

### 1. సూర్య నమస్కారం

ఎలా చేయాలి:

ప్రణమాసనం (ప్రార్థన భంగిమ)లో నిటారుగా నిలబడండి.
ఊపిరి పీల్చుకోండి, హస్త ఉత్తనాసనలో చేతులను పైకి లేపండి.
ఊపిరి పీల్చుకోండి, పాదహస్తాసనానికి (చేతి నుండి పాదాల భంగిమ) ముందుకు వంగండి.
అశ్వ సంచలనాసన (ఈక్వెస్ట్రియన్ పోజ్) లోకి తిరిగి అడుగు పెట్టండి.
ఫలకాసనంలోకి (ప్లాంక్ పోజ్) లోకి వెళ్లండి.
అష్టాంగ నమస్కారం(మోకాళ్ళు, ఛాతీ, గడ్డం భంగిమ) లోకి క్రిందికి.
భుజంగాసనం (కోబ్రా పోజ్)లో ఊపిరి పీల్చుకోండి.
అధో ముఖః స్వనాసన (క్రిందికి కుక్క భంగిమ) లోకి ఊపిరి పీల్చుకోండి.
అశ్వ సంచలనాసనానికి తిరిగి వెళ్ళు.
పాదహస్తాసనంలోకి అడుగు ముందుకు వేయండి, ఆపై మీ చేతులను పైకెత్తి ప్రణామాసనానికి తిరిగి రండి.

### 2. నవాసనం

ఎలా చేయాలి:

కాళ్లు చాచి కూర్చోండి.
కొద్దిగా వెనుకకు వంగి, మీ కాళ్ళను 45డిగ్రీల కోణానికి ఎత్తండి.
నేలకి సమాంతరంగా చేతులను ముందుకు చాచండి.
1530 సెకన్లపాటు అలా ఉంచండి.

### 3. వీరభద్రాసనం

ఎలా చేయాలి:

పాదాలను వెడల్పుగా ఉంచి నిలబడండి.
కుడి పాదాన్ని బయటికి, ఎడమ పాదాన్ని కొద్దిగా లోపలికి తిప్పండి.
కుడి మోకాలిని 90 డిగ్రీల వద్ద వంచి, చేతులు సమాంతరంగా చాచండి.
2030 సెకన్లపాటు అలా ఉండండి

### 4. ఉత్కటాసనం

ఎలా చేయాలి:

పాదాలపై నిటారుగా నిలబడండి.
మోకాళ్లను వంచి, కుర్చీపై కూర్చున్నట్లుగా తుంటిని తగ్గించండి.
చేతులు పైకి ఎత్తండి.
2030 సెకన్లపాటు అలా ఉండండి.

### 5. భుజంగాసనం

ఎలా చేయాలి:

ముందుగా ఆసనం వేసేందుకు బోర్లా పడుకోవాలి.
అరచేతులను భుజాల క్రింద నేలపై పెట్టాలి.
చేతులను కిందికి నెడుతూ తలను మెల్లగా పైకి లేపాలి.
నడుము భాగాన్ని పైకి వంచాలి.
ఇలా 20 సెకన్లపాటు ఉండండి.

### 6. త్రికోణాసనం

ఎలా చేయాలి:

ముందుగా కాళ్లను దూరంగా ఉంచి నిలబడండి. నిదానంగా రెండు చేతులను కూడా భూమికి సమాంతరంగా పైకి లేపి ఉంచాలి. మోచేతులను వంచ కూడదు. అరచేతులను నేలవైపు ఉండే విధంగా చూడాలి. తర్వాత నిదానంగా గాలిని వదులుతూ కుడి చేతితో కుడి పాదాన్ని తాకే విధంగా మెల్లగా శరీరాన్ని వంచాలి.ఇదే సమయంలో ఎడమ అరచెయ్యిని పైకెత్తి నిటారుగా ఉంచాలి. శిరస్సు ఎడమ అరచేతి వైపు చూస్తూ ఉండాలి. తర్వాత శ్వాస పీలుస్తూ పైకి రావాలి. కుడి చేతివైపు ఏ విధంగా శరీరాన్ని వంచామో అదే విధంగా ఎడమ చేతి వైపు కూడా శరీరాన్ని వంచాలి. ఇలా 2030 సెకన్లపాటు ఉండాలి.

### 7. సేతు బంధాసనం

ఎలా చేయాలి:

ముందుగా వెల్లకిలా పడుకోవాలి. తర్వాత మెల్లగా మోకాళ్లను వంచాలి. మోకాళ్లను వంచి శ్వాస గట్టిగా తీసుకొని.. రెండు చేతులతో పాదాలను పట్టుకొని నడుమును పైకి ఎత్తాలి. మీకు వీలైనంత మేర నడుమును ఎత్తాలి.గడ్డానికి ఛాతి తగిలేంతలా నడుమును ఎత్తాలి. నడుము పైకి ఎత్తి ఉండగా.. శరీర భారం పాదాలు, మెడ, తల, భుజాలపై ఉంటుంది. ఈ సేతుబంధాసనంలో వీలైనంత సమయం ఉండాలి. ఆ తర్వాత మళ్లీ సాధారణంగా వెల్లకిలా పడుకున్న పొజిషన్‌కు రావాలి. ఇలా 30 సెకన్ల పాటు చేయాలి.
30 సెకన్లపాటు పట్టుకోండి.

### 8. పశ్చిమోత్తనాసనం

ఎలా చేయాలి:

నేలపై రెండు కాళ్లు చాచి కూర్చోండి. తర్వాత శరీరాన్ని ముందుకు వంచుతూ పొట్టను తొడలపై పెట్టాలి. అలాగే తలను మోకాళ్లపై ఆనించాలి. ఇప్పుడు రెండు చేతులను ముందుకు చాచి రెండు పాదాలను పట్టుకోవాలి. ఇలా 30 సెకన్లపాటు పట్టుకోండి.

### 9. కపోతాసనం

ఎలా చేయాలి:

మొదలు వజ్రాసనంలో కూర్చోవాలి. గాలి పీల్చుకుంటూ తలపైకి ఎత్తాలి. ఇలా చేస్తున్నప్పుడు ధ్యాస వెన్నెముక మీద కేంద్రీకరించాలి. ఇప్పుడు గాలి వదిలేస్తూ చేతులో బ్యాలెన్స్ చూసుకుంటూ మెల్లగా వెనక్కు వంగుతూ ఉండాలి. తలను భూమీ మీద ఆనించాలి. తర్వాత వెనక్కు వంగాక చేతులతో కాళ్లను పట్టుకోవాలి. కాళ్ల దగ్గరకు తలను తీసుకురావాలి. 20 30 సెకన్లపాటు అలా ఉండాలి.

### 10. శలభాసనం

ఎలా చేయాలి:

గడ్డం నేలపై ఆనించి, కొద్దిగా శ్వాస పీల్చి మొదట కుడికాలును మోకాలు వంచకుండా పైకి ఎత్తాలి. ఈ స్థితిలో కొన్ని క్షణాలున్న తర్వాత మెల్లగా కాలు నేలపై ఆనించాలి. ఇదే విధంగా ఎడమకాలితో చేయాలి. మూడేసి సార్లు ఒక్కొక్క కాలితో చేసిన తర్వాత, రెండు కాళ్ళను కలిపి ఒకేసారి పైకి ఎత్తి కొద్ది క్షణాలు ఆగాలి. 2030 సెకన్లపాటు ఇలా చేయాలి. ఈ భంగిమలను క్రమం తప్పకుండా ఆచరించడం వల్ల జీవక్రియ పెరుగుతుంది.





# మజ్జిగలో దీన్ని కలుపుకొని తాగండి..!

మజ్జిగ అంటే అందరికీ ఇష్టం ఉంటుంది. ఇది కేవలం పానీయం మాత్రమే కాదు. ఆరోగ్యానికి మేలు చేసే ఔషధం కూడా. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. దీనిని తాగడం వల్ల అనేక రోగాలు దూరమవుతాయి. ఇందులో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడడం, శరీరాన్ని చల్లబరచడం అనే ఆరోగ్య ప్రయోజనాలు దొరుకుతాయి. అసలు మజ్జిగలో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**జీర్ణ సమస్యలు దూరం**

మజ్జిగలో జీలకర్ర కలుపుకొని తాగడం వల్ల జీర్ణక్రియ సమస్యలన్నీ దూరమవుతాయి. అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు దూరమవుతాయి. అలాగే శరీరంలోని అదనపు ద్రవాలను తొలగించడానికి ఈ జీలకర్ర మజ్జిగ ఎంతగానో ఉపయోగపడుతుంది. వాపును నివారిస్తుంది. చర్మం కాంతివంతంగా మెరిసే విధంగా చేస్తుంది. ముఖ్యంగా మొటిమలు, మచ్చలు వంటి సమస్యలు దూరమవుతాయి. అలాగే జీలకర్రలోని యాంటీ యాక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కండరాల నొప్పులను తగ్గించేందుకు కూడా ఇవి ఎంతగానో సహాయపడుతుంది.

**జీలకర్ర మజ్జిగ తయారు చేయడం ఎలా?**

జీలకర్ర మజ్జిగ తయారు చేసుకోవడానికి, ఒక కప్పు పెరుగు తీసుకోవాలి. అందులో కొద్దిగా జీలకర్ర పొడి, ఉప్పు, నీరు కలుపుకోవాలి. మీకు ఇష్టమైతే కొద్దిగా కారం కూడా కలుపుకోవచ్చు. ఆ మొత్తాన్ని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఆ మజ్జిగను సర్వ్ చేసుకుంటే జీలకర్ర మజ్జిగ సిద్ధమైనట్లే.

**శృంగారానికి కూడా**

మజ్జిగతో పాటు జీలకర్రలో కూడా శృంగానికి పనికొచ్చే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీలకర్ర మజ్జిగను తక్కువగా తీసుకోవడం వల్ల శృంగారంలో కింగ్ అవ్వొచ్చు. మీ భాగస్వామిని సంతృప్తి పరచొచ్చు. వెంటనే స్కలనం కాకుండా రతి క్రీడను ఎంజాయ్ చేయవచ్చు. మజ్జిగ జీలకర్రను తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. అయితే కొన్ని కొన్ని సందర్భాల్లో మాత్రం కొంత సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అవేంటంటే? మజ్జిగలో లాక్టోస్ అనే పదార్థం ఎక్కువ మొత్తం ఉంటుంది. అయితే ఈ మజ్జిగ అంటే అసహనం ఉన్న వారికి ఈ జీలకర్ర మజ్జిగ తాగడం వల్ల వాంతులు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో పాటు అపానవాయువు, ఉబ్బరం, అతిసారం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే దీనిని అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. చలికాలంలో మజ్జిగను ఎక్కువగా తీసుకోవడం శరీరం చల్లగా మారే అవకాశం ఉంటుంది. మజ్జిగ జీలకర్రను మితంగా తీసుకోవడం మంచిది. తాజాగా తయారు చేసిన మజ్జిగ జీలకర్రను తీసుకోవడం మంచిది. ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్యుని సలహా తీసుకోవడం మంచిది.

# మిగిలిన అన్నంతో దోశలు చేసుకోండి..!

ప్రతి ఇంట్లోనే అన్నం మిగిలిపోవడం కామన్. అయితే ఈ అన్నం పడేయాలంటే చాలా మందికి మనస్కరించదు. అందుకే మిగిలిన అన్నంతో అనేక రకాల వంటలు చేసుకోవచ్చు. ఉదయం మిగిలిపోయిన అన్నాన్ని రాత్రి తినేందుకు ఎంతో మంది ఇష్టపడరు. నిజానికి రాత్రి వండిన అన్నం ఉదయం తింటే ఎంతో ఆరోగ్యం. అలాగే ఉదయం వండిన అన్నం రాత్రి తిన్నా కూడా ఆరోగ్యమే. వేసవికాలంలో అన్నం బయట ఉంచితే త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. కానీ చలికాలంలో అది త్వరగా పాడవదు. కాబట్టి ఆ అన్నం తినడం సురక్షితమే. మీకు మిగిలిపోయిన అన్నాన్ని తినడం ఇష్టం లేకపోతే వాటిని దోశలుగా మార్చేయండి. ఇవి చాలా టేస్టీగా ఉంటాయి. పైగా ఇన్స్టంట్ దోశలు, కొబ్బరి చట్నీతో లేదా టమాటో చట్నీతో ఈ దోశలను తింటే చాలా రుచిగా ఉంటాయి. ఒక్కసారి మీరు చేసుకొని చూడండి. ఈ రెసిపీ మీ ఇంటిల్లిపాదికి నచ్చడం ఖాయం.

**కావలసిన పదార్థాలు**

మిగిలిపోయిన అన్నం - రెండు కప్పులు
నీరు - సరిపడినంత
వంటసోడా - అర స్పూను
ఉప్పు - రుచికి సరిపడా
పుల్లని పెరుగు - ఒక కప్పు
గోధుమపిండి - ఒక కప్పు
ఉప్మా రవ్వ - ఒక కప్పు

**తయారీ విధానం...**

ముందుగా అన్నాన్ని పొడిపొడిగా ఉండేలా చూసుకోండి. మిక్సీలో ఈ అన్నాన్ని గోధుమ పిండిని వేసి బాగా కలపండి. అందులోనే నీళ్లను కూడా వేయండి. అలాగే పుల్లని పెరుగును కూడా వేసి బాగా కలపండి. ఈ మొత్తం మిశ్రమాన్ని పంపండి. దీన్ని ఒక గిన్నెలో వేయండి.

ఆ గిన్నెలోనే ఉప్మా రవ్వను కూడా వేసి బాగా కలుపుకోండి. రుచికి సరిపడా ఉప్పుని, వంట సోడాను కూడా వేయండి. దోశెలు వేయడానికి ఈ మిశ్రమం పలుచగా ఉండేలా చూసుకోండి. అవసరమైతే నీటిని కలపండి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఒక పది నిమిషాలు పాటు పక్కన వదిలేయండి. ఇప్పుడు స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాయండి. ఆ నూనె పై ఈ దోశల పిండిని పలుచగా వచ్చేలా వేసుకోండి. రెండు వైపులా కాల్చాక తీసి పక్కన పెట్టుకోండి. అంతే టేస్టీ దోశెలు రెడీ అయినట్టే. దీన్ని కొబ్బరి చట్నీతో తిన్నా అల్లం చట్నీతో తిన్నా టమోటా చట్నీ తో తిన్నా రుచిగా ఉంటాయి. అన్నం మిగిలిపోయినప్పుడు పడేయాల్సిన అవసరం లేకుండా ఇలా దోశలు వండుకుంటే రుచి అదిరిపోతుంది.





# సోషల్ మీడియా సెన్సేషన్‌గా దీప్తి సునయన

సోషల్ మీడియా ప్రభావంతో కొత్త తరం సెలబ్రిటీలు వేగంగా వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి సోషల్ మీడియా సెన్సేషన్ దీప్తి సునయన పేరు నెట్టింట వైరల్‌గా మారింది. ఒక్క సినిమా కూడా చేయకుండానే భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ, కుర్రాళ్లలో ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకుంది. డబ్‌స్మాష్ వీడియోలతో మొదలైన దీప్తి సునయన ప్రయాణం, తర్వాత టిక్‌టాక్ వీడియోలు, యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్స్ వరకు విస్తరించి ఆమెను సోషల్ మీడియా స్టార్‌గా మార్చింది. ఆమె చేసిన ప్రతి పోస్ట్‌కు వేలల్లో లైక్స్, కామెంట్స్ వస్తుండటంతో ఆమెకు ఉన్న పాపులారిటీ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. తరువాత బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన దీప్తి సునయన, ఆ షో తర్వాత కూడా షార్ట్ ఫిల్మ్స్, కవర్ సాంగ్స్ చేస్తూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా కొనసాగుతోంది. సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశాలు వస్తాయని అభిమానులు భావించినప్పటికీ, ప్రస్తుతం ఆమె పూర్తిగా సోషల్ మీడియా కంటెంట్‌పైనే దృష్టి పెట్టింది. చీరకట్టులోనూ, మోడ్రన్ లుక్‌లోనూ తన అందచందాలతో ఆకట్టుకుంటూ యువతను మంత్రముగ్ధులను చేస్తున్న దీప్తి సునయన, సోషల్ మీడియా వేదికగా తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతూ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చాయి.



# వృషకర్మతో నాగ చైతన్య కొత్త ప్రయాణం

## ఇప్పటికీ ఆమెతోనే బెస్ట్ కెమిస్ట్రీ..!

అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య వరుస విజయాలతో మంచి ఫామ్‌లో కొనసాగుతున్నారు. కంటెంట్ ప్రధానంగా ఉన్న సినిమాలను ఎంచుకుంటూ హిట్స్ అందుకుంటున్న ఆయన, చివరిగా విడుదలైన 'తండేల్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ప్రస్తుతం నాగ చైతన్య పీరియాడికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు 'వృషకర్మ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. జెట్ స్పీడ్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, నాగ చైతన్య గతంలో చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో నటించిన హీరోయిన్లలో ఎవరి కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని అడిగిన ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేసింది. దాదాపు 27 సినిమాల్లో, 20కి పైగా హీరోయిన్లతో నటించిన నాగ చైతన్య, ఎలాంటి తడబాటు లేకుండా హీరోయిన్ కృతిశెట్టితో కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్య ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది. నాగ చైతన్య సాయి పల్లవి, సమంత, తమన్నా, రాశి ఖన్నా వంటి స్టార్ హీరోయిన్లతో కలిసి నటించినప్పటికీ కృతిశెట్టి పేరు చెప్పడం విశేషంగా మారింది. కృతిశెట్టితో ఆయన 'బంగార్రాజు', 'కస్టడీ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.




# ఇరుముడి కట్టు పాట 29న విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.

# సినిమా కంటే చదువుపై ఆసక్తి ఎక్కువ: పూనమ్



తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి పూనమ్ కౌర్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాను సినిమాల్లోకి అనుకోకుండా వచ్చానని, అసలు తన లక్ష్యం వేరే రంగమని ఆమె వెల్లడించారు. చిన్నప్పటి నుంచే సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయిందని పూనమ్ కౌర్ తెలిపారు. తన తల్లి పడిన కష్టాలను చూసి, ప్రభావవంతమైన లాయర్‌గా మారాలని కలలు కన్నానని ఆమె పేర్కొన్నారు. కపిల్ సిబల్, రామ్ జెఠ్మలానీ వంటి ప్రముఖ లాయర్లలా ఎదగాలనేది తన లక్ష్యమని చెప్పారు. ఒక సందర్భంలో తాము నివసించిన భవనం తమ తండ్రిదని, ఆయన మరణానంతరం ఆస్తి కోసం తన తల్లి ఏడేళ్ల పాటు పోరాడాల్సి వచ్చిందని పూనమ్ గుర్తుచేసుకున్నారు. ఈ అనుభవాలే తనను న్యాయ రంగం వైపు ప్రేరేపించాయని తెలిపారు. నిఫ్ట్, నాల్సార్ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల ప్రవేశ పరీక్షలు కూడా రాశానని, నాల్సార్‌లో అవకాశం వచ్చి ఉంటే తాను సినిమాల వైపు వచ్చేదాన్ని కాదని స్పష్టం చేశారు. నటనను తాను కేవలం ఒక పార్ట్‌టైమ్ ఉద్యోగంలా మాత్రమే చూశానని ఆమె వ్యాఖ్యానించారు. బాలీవుడ్‌లో తన ప్రారంభ అనుభవాలను పంచుకుంటూ, ఒక పెద్ద ఖాన్ కుటుంబానికి చెందిన వ్యక్తి నిర్మించిన సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చినప్పటికీ షూటింగ్ సమయంలో అనేక అవమానాలు ఎదురయ్యాయని తెలిపారు. తన సన్నివేశాలను కావాలనే తగ్గించడం, మేకప్‌లో మార్పులు చేయడం, ఒక ప్రత్యేక నటికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయని ఆమె ఆరోపించారు. ఈ కారణంగా పది రోజుల షూటింగ్ అనంతరం ఆ ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చానని పూనమ్ కౌర్ పేర్కొన్నారు. అప్పటి పరిస్థితులపై నిర్మాతకు నేరుగా ఫోన్ చేసి, దర్శకుడి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కూడా ఆమె తెలిపారు. చివరగా సినిమాల కంటే చదువు, పరిశోధనపై తనకు ఎక్కువ ఆసక్తి ఉందని, ఐక్యరాజ్యసమితిలో పని చేయాలనేది తన అసలు లక్ష్యమని పూనమ్ కౌర్ స్పష్టం చేశారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.